ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :199 గురువారం మే 1 4 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# ఉచితాలు అప్పుల కుప్ప

-సంక్షేమం వర్సెస్ ఆర్థిక భారం

-పెరుగుతున్న రుణాల మోత

-నిపుణుల హెచ్చరికలు




మే 13 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రాల్లో ఉచిత పథకాల అమలు తీరు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న హామీలు ప్రభుత్వ ఖజానాపై మోయలేని భారంగా మారుతున్నాయి. సంక్షేమం పేరుతో పంచుతున్న నిధులు చివరకు రాష్ట్రాల అప్పులను రికార్డు స్థాయికి చేరుస్తున్నాయి. అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులను ఉచిత పథకాలకు మళ్లించడం వల్ల మౌలిక సదుపాయాల కల్పన కుంటుపడుతోందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల రాజకీయాల కోసం రాష్ట్రాల భవిష్యత్తును పణంగా పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం అనేక రాష్ట్రాల అప్పులు వాటి స్థూల ఉత్పత్తిలో ముప్పై శాతం మించిపోయాయి. కేవలం వడ్డీలు చెల్లించడానికే కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. సంక్షేమ పథకాలు అవసరమే అయినప్పటికీ, అవి ఉత్పాదకతను పెంచే విధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉచిత విద్యుత్, నగదు బదిలీ వంటి పథకాల వల్ల తాత్కాలిక ప్రయోజనం ఉన్నా, దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఆదాయ వనరులను పెంచుకోకుండా కేవలం అప్పులపై ఆధారపడి పాలన సాగించడం వల్ల భవిష్యత్తు తరాలపై పెను భారం పడే ప్రమాదం ఉంది. ఆర్థిక క్రమశిక్షణ పాటించని పక్షంలో శ్రీలంక వంటి దేశాలు ఎదుర్కొన్న సంక్షోభం రాష్ట్రాల్లోనూ తలెత్తే అవకాశం ఉందని హెచ్చరికలు అందుతున్నాయి. కేంద్రీయ సంస్థలు సైతం రాష్ట్రాల రుణ పరిమితిపై కఠిన ఆంక్షలు విధిస్తున్నాయి. ఉచితాల వల్ల ప్రజల్లో సోమరితనం పెరుగుతుందని, కష్టపడే తత్వం తగ్గుతుందని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో నాణ్యత పెంచడానికి ఖర్చు చేయాల్సింది పోయి, నగదు రూపంలో పంచడం వల్ల శాశ్వత ప్రయోజనం చేకూరదు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం మొత్తం వడ్డీలకు, జీతాలకు సరిపోతుండటంతో కొత్త ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడుతోంది. పాలకులు తమ ప్రాధాన్యతలను మార్చుకోకపోతే ఆర్థిక వ్యవస్థ పతనం తప్పదని విశ్లేషణలు చెబుతున్నాయి. ప్రతి పథకం వెనుక సామాజిక ప్రయోజనం ఉండాలే తప్ప కేవలం ఎన్నికల గెలుపు ఉండకూడదు. అప్పుల భారం పెరిగితే చివరకు పన్నుల భారం సామాన్యుడిపైనే పడుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు, ఇతర సేవలు ప్రియం కావడానికి ఈ ఆర్థిక లోటు కూడా ఒక కారణం. ప్రభుత్వాలు తమ వ్యయాన్ని నియంత్రించుకుని, సంపద సృష్టిపై దృష్టి పెట్టాలి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాలు కోలుకోవడానికి కఠినమైన సంస్కరణలు తప్పనిసరి. ఉచిత పథకాలు రాష్ట్రాల అప్పుల భారాన్ని పెంచుతూ ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెడుతున్నాయి. సంక్షేమం అనేది కేవలం ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికే ఉండాలి తప్ప, ఓట్ల వేటలో ఆయుధం కాకూడదు. రాష్ట్రాలు తమ ఆర్థిక స్థితిగతులను బేరీజు వేసుకుని బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలి. అభివృద్ధి పథంలో దూసుకుపోవాల్సిన రాష్ట్రాలు అప్పుల భారం కింద నలిగిపోవడం దేశాభివృద్ధికి ఏమాత్రం మంచిది కాదు. నిపుణుల హెచ్చరికలను గమనంలోకి తీసుకుని సత్వరమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. అప్పుడే సుస్థిరమైన ఆర్థిక భవిష్యత్తు సాధ్యమవుతు

## ఆంధ్రప్రదేశ్‌కు ఆస్ట్రేలియా భాగస్వామ్యం



-విద్య, నైపుణ్యాభివృద్ధిపై కీలక చర్చలు

-పెట్టుబడులు, ఉద్యోగాలపై ఆశాభావం

-భవిష్యత్ భాగస్వామ్యాలపై లోకేశ్ వ్యాఖ్యలు

అమరావతి, మే 13 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌తో ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు జరిగాయి. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్తో సమావేశమై పలు రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, పునరుత్పాదక ఇంధనం, కీలక ఖనిజాలు, వాణిజ్యం, డేటా సెంటర్ల రంగాల్లో ఆంధ్రప్రదేశ్ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు ఇరు పక్షాలు ఆసక్తి వ్యక్తం చేశాయి. ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయ భాగస్వామ్యాలు, ఆధునిక పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశాలు ఉన్నాయని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ముందంజలో నిలిపే దిశగా అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో వేగవంతమైన అభివృద్ధి, పారదర్శక విధానాలు, సాంకేతిక మౌలిక వసతులు పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని లోకేశ్ తెలిపారు. భవిష్యత్‌లో ఆస్ట్రేలియా సంస్థలతో మరిన్ని ఒప్పందాలు కుదిరే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వెట్‌ల్యాండ్స్ పరిరక్షణకు వేగం



-నోటిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు

-డిజిటల్ మ్యాపింగ్, సరిహద్దుల గుర్తింపుపై దృష్టి

-రామ్‌సార్ గుర్తింపుకు మంజీరా ప్రతిపాదనలు

2

## సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం



-మంత్రి కోమటిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత

-భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

-గోదావరి పుష్కరాలపై ముందస్తు కసరత్తు

హైదరాబాద్, మే 13 (మనప్రజాప్రతినిధి): ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు హాజరుకావాలని కోరుతూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, అర్చకులు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. దేవాదాయ శాఖ, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు

2

## అమరావతికి వైద్య విద్యా వైభవం




-నిడమర్రులో బొల్లినేని మెడికల్ కాలేజీ, స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన

-2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యం

-రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్న చంద్రబాబు

అమరావతి, మే 13 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి వైద్య, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రణాళికలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నిడమర్రులో ఏర్పాటు చేయనున్న "బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్"కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ గంటి హరీష్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పారిశ్రామికవేత్తల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన కిమ్స్ ఆస్పత్రి ప్రస్తుతం వేల కోట్ల రూపాయల

2

# అమరావతికి వైద్య విద్యా వైభవం

మొదటి పేజీ తరువాయి



సంస్థగా ఎదిగిందని గుర్తుచేస్తూ, పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తేనే రాష్ట్రానికి సంపద సృష్టి సాధ్యమవు తుందని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధికి మరింత మంది పెటు ్టబడిదారులు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.గతంలో రాష్ట్రంలో విధ్వంసకర పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించిన చంద్రబాబు, ఇప్పుడు శంకుస్థాపనలతో ఆగిపోకుండా నిర్దేశిత గడువుల్లోనే ప్రాజెక్టులు పూర్తి చేయాలని అధికారులకు సూచిం చారు. బొల్లినేని మెడికల్ కాలేజీ, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇటీవల శంకుస్థాపన చేసిన గూగుల్ క్యాంపస్‌ను 2028 ఆగస్టుకు, ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ తొలి దశను 2028 డిసెంబరుకు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అనుమతుల ప్రక్రియను ప్రభుత్వం వేగవంతంగా పూర్తి చేస్తుందని, నిర్మాణ బాధ్యతలను పారిశ్రామికవేత్తలు సమర్థంగా నిర్వహిం చాలని సూచించారు. మొత్తం 25 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఇందులో 23 ఎకరాల్లో మెడికల్ కాలేజీ, 2 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మించనున్నారు. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, 1000 నాన్ మెడికల్ సీట్లు ఏర్పాటు చేయడంతో పాటు మరో వెయ్యి మందికి ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. లక్ష మందికి నైపుణ్యాభివృద్ధి కల్పించి ప్రపంచవ్యాప్తంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఉన్న డిమాండ్‌ను తీర్చేలా ఈ సంస్థను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్య సిబ్బందిలో ఒకరికి అమరావతిలోనే శిక్షణ ఇచ్చే స్థాయికి ఈ సంస్థ ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాం క్షించారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రణాళికలను కూడా ముఖ్యమంత్రి ప్రకటిం చారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాయలసీమలో ఈ నెల 15న ఫైటర్ జెట్ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. కర్నూలును డ్రోన్ సిటీగా, శ్రీసిటీని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అమరావతితో పాటు విశాఖపట్నాన్ని కూడా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. వైద్యారోగ్యశాఖకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించామని, సంజీవని ద్వారా డిజిటల్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొ న్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని చంద్రబాబు స్మరించుకున్నారు. రైతుల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమరావతిని భవిష్యత్ నగరంగా తీర్చిదిద్ది రాష్ట్ర యువతకు లక్షలాది ఉద్యోగ అవ కాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# వెట్‌ల్యాండ్స్ పరిరక్షణకు వేగం

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్, మే 13 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలోని వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ, అధికారిక నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. చెరువులు, నీటి వనరులు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ, నిర్వహణ నిబంధనలు2017ను కచ్చితంగా అమలు చేయాలని సమావేశంలో స్పష్టం చేశారు. వెట్‌ల్యాండ్స్ సరిహద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలకు సూచనలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 12,249 వెట్ ల్యాండ్స్‌పై గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తయిందని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 4,023 వెట్‌ల్యాండ్స్‌కు సరిహద్దుల నిర్ధారణ పూర్తైనట్లు తెలిపారు.మిగిలిన ప్రాంతాల్లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్త సర్వేలు పూర్తి చేసి అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. జిల్లా వెట్‌ల్యాండ్ అథారిటీల నుంచి ఖచ్చితమైన సమాచారం అందేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని పేర్కొన్నారు. ఖమ్మం, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ప్రధాన వెట్‌ల్యాండ్స్ సహా 28 ప్రాంతాలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు సిద్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో గెజిట్ నోటిఫికేషన్, ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. మంజీరా వన్యప్రాణి అభయారణ్యానికి అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన రామ్‌సార్ సైట్ గుర్తింపు పొందేందుకు పంపిన ప్రతిపాదనపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఇరిగేషన్ శాఖ వద్ద తుది పరిశీలనలో ఉందని, అనంతరం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖకు పంపను న్నట్లు అధికారులు వెల్లడించారు.వెట్‌ల్యాండ్స్ పరి రక్షణలో నిపుణుల సూచనలు, శాస్త్రీయ అధ్యయనాలు కీలకమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విజయవంతమైన నమూ నాలను ప్రచారం చేయడంతో పాటు స్థానిక స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిం చారు. వెట్‌ల్యాండ్స్‌లో ఆక్రమణలు, ఘన వ్యర్థాల పారవేత, శుద్ధి చేయని మురుగు నీటి విడుదల వంటి చర్యలు పూర్తిగా నిషేధించబడినవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, అటవీ దళాల అధిపతి డాక్టర్ సువర్ణ, వైల్డ్‌లైఫ్ చీఫ్ వినయ్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి



సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. భక్తుల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, భద్రత, ఘాట్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రానున్న గోదావరి పుష్కరాల కోసం కూడా ప్రభుత్వం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించినట్లు కోమటిరెడ్డి వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం పుష్కర ఘాట్ల నిర్మాణం, రోడ్డు కనెక్టివిటీ అభివృద్ధి పనులపై ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు.

# విద్యా వారోత్సవాలకు ప్రాధాన్యం




**-హుస్నాబాద్‌లో విద్యా వర్క్‌షాప్ నిర్వహణ**
**-సర్పంచ్‌లు, కౌన్సిలర్లతో చర్చలు**
**-ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి**
**-మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, మే 13 (మనప్రజాప్రతినిధి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో హుస్నాబాద్ వైశ్య భవన్‌లో విద్యా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల మెరుగుదలపై చర్చించారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు విద్యా భివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, ఎంఈవోలు, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల సర్పంచ్‌లు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# మోదీ, రేవంత్‌పై కవిత విమర్శలు




3

# మోదీ, రేవంత్‌పై కవిత విమర్శలు

తరువాయి భాగం



హైదరాబాద్, మే 13 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు పొదుపు సూత్రాలు చెబుతూ ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం భారీగా నిధులు ఇస్తున్నారని ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలుమార్లు కేంద్రాన్ని కలుస్తున్నారని, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మాత్రం పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని విమర్శించారు. “మీ గురువును చూసైనా నేర్చుకోండి. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం ప్రధానికి లేఖ రాయండి” అంటూ రేవంత్ రెడ్డికి సూచించారు. రాష్ట్రానికి నీటి హక్కులు సాధించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడింది నీళ్ల కోసమేనని గుర్తుచేసిన కవిత, గోదావరి, కృష్ణా నదుల్లో రాష్ట్రానికి ఉన్న వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని అన్నారు. గోదావరిలో 964 టీఎంసీలు వినియోగించే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 220 టీఎంసీలు మాత్రమే వాడుకున్నామని తెలిపారు. కృష్ణా జలాల్లో కూడా రాష్ట్రం తన వాటాను పూర్తిగా వినియోగించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సాగుయోగ్యమైన ప్రతి గుంటకు నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. నీటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై వచ్చిన ఆరోపణలను కూడా కవిత ప్రస్తావించారు. బండి సంజయ్ కుమారుడు దేశం విడిచి వెళ్లకుండా వెంటనే లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు తీవ్రమైనవని, పారదర్శక విచారణ జరగాలంటే ఈ చర్యలు అవసరమని పేర్కొన్నారు. బాధితురాలి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో బయటకు రావడం దురదృష్టకరమని, వాటిని ప్రచారం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికలకు సంబంధించిన అంశాల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు. సమాజం ఆడపిల్లలను సులభంగా క్షమించదని, అందువల్ల బాధితురాలి గోప్యత కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కొన్ని పార్టీలు కేవలం సామాజిక మాధ్యమాల్లో ట్వీట్లు పెట్టి సమస్య పరిష్కరించినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తాము ఎల్లప్పుడూ ఆడపిల్లల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లు, మహిళా బిల్లు, జనగణన అంశాలపై కూడా కవిత స్పందించారు. మహిళా బిల్లులో ఓబీసీ ఉపకోటా తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులం, ఉపకులం, సామాజిక స్థితిగతులను నమోదు చేయాలని కోరారు. బీసీలకు రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా కోర్టుకు కూడా వెళ్తున్నామని తెలిపారు. తెలంగాణలో రాజకీయ శూన్యతను ప్రశ్నించేందుకు తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని కవిత పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా “జెండా పండుగ” నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పార్టీ నిర్మాణానికి ఇది పునాదిగా నిలుస్తుందని, ఈ కార్యక్రమాల ద్వారా నాయకత్వ బాధ్యతలు కూడా అప్పగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నీటి నిర్వహణ, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# పార్కింగ్ సమస్యపై సీఎం దృష్టి

**-ఉబర్ ప్రతినిధులతో రేవంత్ సమావేశం**
**-మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలపై సూచనలు**
**-ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు ఆసక్తి**





హైదరాబాద్, మే 13 (మనప్రజాప్రతినిధి): ప్రధాన నగరాల్లో రోజురోజుకు తీవ్రమవుతున్న పార్కింగ్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఉబర్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఉబర్ సంస్థ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా ఉబర్ సంస్థ కార్యకలాపాలు, హైదరాబాద్‌లో విస్తరణ ప్రణాళికలను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హైదరాబాద్‌లోనే ఉందని దారా ఖోస్రోషాహి తెలిపారు. ప్రస్తుతం అక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ కార్యాలయం నిర్మించేందుకు ఆసక్తి ఉన్నట్లు తెలిపారు. ఈ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ సమస్య తీవ్రమవుతోందని ముఖ్యమంత్రి సమావేశంలో ప్రస్తావించారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే ఆధునిక పార్కింగ్ విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా మెట్రో స్టేషన్లు, వాణిజ్య కేంద్రాల వద్ద సరైన పార్కింగ్ సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలతో పాటు ఈవీ ఛార్జింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలని ఉబర్ ప్రతినిధులకు సూచించారు. ముఖ్యమంత్రి చేసిన సూచనలపై సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం తెలిపింది. నగర రవాణా వ్యవస్థను ఆధునీకరించడంలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఆధునిక అర్బన్ మొబిలిటీ కేంద్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు వివరాలను ఉబర్ ప్రతినిధులకు వివరించారు. సుమారు 30 వేల ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ నగరం ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 500 కంపెనీలను ఈ ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే అనేక సంస్థలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉండటం ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత డిసెంబరులో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా సంస్థలు పాల్గొని పెట్టుబడులపై ఆసక్తి చూపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయం నిర్మాణానికి దారా ఖోస్రోషాహి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియాసౌత్ ఆసియా అధ్యక్షుడు ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత

**-చర్చి నేతలపై దుండగుల కాల్పులు**
**-ముగ్గురు మత పెద్దల దారుణ హత్య**
**-జాతీయ రహదారి దిగ్బంధానికి పిలుపు**



ఇంఫాల్, మే 13 (మనప్రజాప్రతినిధి): జాతుల మధ్య ఘర్షణలతో ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటన చోటుచేసుకుంది. చర్చి నేతలు ప్రయాణిస్తున్న వాహనాలపై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరపడంతో ముగ్గురు మత పెద్దలు దారుణంగా మరణించారు. ఈ ఘటనతో రాష్ట్రంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ముఖ్యంగా కుకీ, జో వర్గాల ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చురాచంద్‌పూర్ జిల్లాలోని లామ్కాలో జరిగిన థాడౌ బాప్టిస్ట్ అసోసియేషన్ సమావేశానికి పలువురు చర్చి నేతలు హాజరయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం వారు రెండు వాహనాల్లో కాంగ్‌పోక్పి వైపు బయలుదేరారు. మార్గమధ్యలో గుర్తుతెలియని దుండగులు వారి వాహనాలపై ఒక్కసారిగా కాల్పులకు దిగినట్లు సమాచారం. ఈ దాడి పూర్తిగా లక్ష్యంగా చేసుకుని జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కాల్పుల్లో మణిపూర్ బాప్టిస్ట్ కన్వెన్షన్ మాజీ ప్రధాన కార్యదర్శి వీ సిట్లో, వీ కైగౌలున్, పాస్టర్ పాగౌలెన్ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన మతపరమైన వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఈ దాడిలో మరో ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన ఎస్.ఎం. హావు, హెకై సిమ్టే, పావోతాంగ్తో పాటు రెండు వాహనాల డ్రైవర్లు లెలెన్, గౌమాంగ్‌లను సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. చర్చి నేతల హత్యను కుకీ విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండించింది. నాగాలాండ్‌తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు మణిపూర్‌ను అనుసంధానించే కీలక జాతీయ రహదారి2ను తక్షణమే దిగ్బంధించాలని పిలుపునిచ్చింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో రవాణా వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. భద్రతా బలగాలు అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలు తీవ్ర ఆందోళనకు దారితీస్తున్న నేపథ్యంలో ఈ తాజా ఘటన పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. కాంగ్‌పోక్పి, చురాచంద్‌పూర్ పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పునరుద్ధరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి

# విజయ్‌తో కశ్మీర్‌కు క్రేజ్




అనంతనాగ్, మే 13 (మనప్రజాప్రతినిధి): దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా ఒకప్పుడు ఉగ్రవాద కార్యకలాపాలతో వార్తల్లో నిలిచేది. భద్రతా బలగాల తనిఖీలు, ఉద్రిక్త పరిస్థితులు, పర్యాటకుల భయాందోళనలతో ఈ ప్రాంతం చాలా కాలం పాటు సాధారణ జీవనానికి దూరంగా నిలిచింది. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అనంతనాగ్‌లోని ‘సిఫార్ కేఫే’ ప్రస్తుతం తమిళ పర్యాటకులతో సందడిగా మారింది. యువత ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ, కుటుంబాలు ఆసక్తిగా కేఫేను సందర్శిస్తూ ఈ ప్రాంతానికి కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయి. ఈ మార్పుకు ప్రధాన కారణంగా తమిళ సూపర్ స్టార్, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నిలిచారు. విజయ్ నటించిన ‘లియో’ సినిమా చిత్రీకరణలో భాగంగా ఈ కేఫేలో కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించారు. షూటింగ్ సమయంలో విజయ్ ఇక్కడికి వచ్చి స్థానిక ప్రత్యేక వంటకం అయిన ‘ట్రౌట్ ఫిష్’ను రుచి చూశారు. సాధారణంగా కనిపించే ఈ చిన్న సంఘటన అభిమానుల దృష్టిలో ప్రత్యేకంగా మారింది. సినిమా విడుదలైన తర్వాత ‘సిఫార్ కేఫే’ గురించి సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో తమిళనాడు నుంచి అభిమానులు వందల కిలోమీటర్లు ప్రయాణించి ఈ ప్రదేశాన్ని సందర్శించడం ప్రారంభించారు. ప్రస్తుతం కేఫే గోడలన్నీ విజయ్ పోస్టర్లతో నిండిపోయాయి. అభిమానులు అక్కడికి వెళ్లి ఫొటోలు దిగడం, వీడియోలు చిత్రీకరించడం, విజయ్ కూర్చున్న ప్రదేశంలో కూర్చోవడం వంటి విషయాలను ప్రత్యేక అనుభూతిగా భావిస్తున్నారు. కేఫే సిబ్బంది కూడా విజయ్ షూటింగ్ సమయంలో జరిగిన సంఘటనలను సందర్శకులకు ఆసక్తిగా వివరిస్తున్నారు. ఆయన ఏ వంటకం ఆర్డర్ చేశారో, ఎక్కడ కూర్చున్నారో చెబుతూ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నారు. ‘లియో’ సినిమా విడుదల సమయంలోనే ఈ కేఫేకు గుర్తింపు వచ్చినప్పటికీ, విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ఆసక్తి మరింత పెరిగింది. అభిమానులు తమ అభిమాన నటుడు, ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన వ్యక్తి సందర్శించిన ప్రదేశాన్ని చూడటం గర్వంగా భావిస్తున్నారు. దీంతో సాధారణ కేఫేగా ఉన్న ఈ స్థలం ఇప్పుడు ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారిపోయింది. స్థానిక వ్యాపారులకు కూడా ఇది ఆర్థికంగా పెద్ద ఊరటనిస్తోంది. ఒకప్పుడు ఉగ్రవాదం కారణంగా ప్రజలు వెళ్లేందుకు భయపడిన అనంతనాగ్ ప్రాంతానికి ఇప్పుడు సినిమా ప్రభావంతో పర్యాటకులు భారీగా రావడం విశేషంగా మారింది. కశ్మీర్ ప్రకృతి అందాలు, స్థానిక ఆహారం, సినిమా షూటింగ్ ప్రాంతాలపై ఆసక్తి పెరగడంతో పర్యాటక రంగానికి కొత్త ఊపు వచ్చింది. ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల ద్వారా ఈ ప్రాంతాన్ని మరింత ప్రచారం చేస్తుండటం స్థానికులకు లాభదాయకంగా మారింది. సినిమా ప్రభావం సమాజంపై ఎంత లోతుగా ఉంటుందో ఈ ఘటన మరోసారి నిరూపించింది. విజయ్ కేవలం సినిమా షూటింగ్ కోసం అక్కడికి వెళ్లినా, అది తమిళనాడుకశ్మీర్ మధ్య ఒక కొత్త అనుబంధానికి దారి తీసింది. సిఫార్ కేఫే ఇప్పుడు కేవలం భోజనం చేసే ప్రదేశం మాత్రమే కాదు, రెండు విభిన్న సంస్కృతులను కలిపే వారధిగా మారింది. పర్యాటక రంగం, స్థానిక ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక మార్పిడిశ్రీశ్రీ కలిసి ఈ కేఫేను ప్రత్యేక గుర్తింపుతో నిలబెట్టాయి.

# బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,దూల్మిట్ట, జనగామ:జనగామ నియోజక వర్గం. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని దూల్మిట్ట సిపిఐ మండల కార్యదర్శి వలబోజు నరసింహాచారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వలబోజు నరసింహాచారి, మాట్లాడుతూ... మైనర్ బాలికపై జరిగిన ఘటనను హనీ ట్రాప్‌గా చూపిస్తూ కేసును నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి బండి సాయి భగీరథను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. బాధిత బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రతి ఒక్కరూ పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# నీట్ పరీక్షల రద్దుపై భగ్గుమన్న టీఆర్ఎస్వీ



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్లమే,13:నీట్ పరీక్షల నిర్వ హణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బుధవారం సిరిసిల్ల పట్టణంలోని చేనేత షాపు వద్ద టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. కేంద్ర /ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, పేపర్ లీకేజీలు, అవినీతి కారణంగా పరీక్షలను రద్దు చేయడం దుర్మార్గమని విమర్శించారు."వేలాది మంది విద్యార్థుల ఆశలపై కేంద్రం నీళ్లు చల్లింది. పరీక్షల నిర్వహణలో విఫలమై నీట్ రద్దు వరకు తీసుకురావడం అత్యంత సిగ్గుచేటు. ఇది కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని కంచర్ల రవి గౌడ్ అన్నారుప్రశ్నాపత్రాల లీకులు, నిర్వహణ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి నాయకులు విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో యువత ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారునీట్ వ్యవహారంలో బాధితులకు న్యాయం జరగకపోతే, టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, అరెల్లి వినయ్ కుమార్, సదుల శేఖర్, ఎండి అజ్జు, బల్యాల ప్రవీణ్, బైకని వేణుగోపాల్ యాదవ్, లింగంపల్లి అబ్బి, పవన్, లక్ష్మణ్, మడుపు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,దూల్మిట్ట,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఐ ధూల్మిట్ట మండల కార్యదర్శి వలబోజు నరసింహాచారి అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం రోజున మండలంలోని జాలపల్లి ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం సిపిఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నర్సింహా చారి మాట్లాడుతూ.. రైతులు లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నెలరోజుల వరకు గడుస్తున్న కేంద్రాల్లో రైతులకు తాగునీరు, విద్యుత్,టార్పాలిన్ కవర్లు కనీస సౌకర్యాలు కల్పించకుండా సకాలంలో బార్దాన్ ఇవ్వకపోవడంతో రైతులు కల్లాల్లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే కొనుగోలను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో చేటుకూరి ఆంజనేయులు,మెతుకు జగన్మోహన్ రెడ్డి,ఇస్తారి సాయిలు,యాచరేణి బాలరాజు,గుండెల్లి సంపత్,గొట్టిమొక్కల పెంటచారి,అయిలేని కనకవ్వ,నర్మెట లచ్చుమ్మ,దాసరి పద్మ, ఆలకుంట కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.చేర్యాల మండలంలోని ముస్త్యాల రైతు వేదికలో జనగాం నియోజకవర్గం లోని నాలుగు మండలాలకు,99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో చేర్యాల, కొమురవెల్లి దూల్మిట్ట, మద్దూరు మండలాల్లోని గ్రామ సర్పంచులు,చేరియాల మున్సిపాలిటీలోని మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు పాల్గొనడం జరిగింది.అదేవిధంగా ఈ కార్యక్రమంలో చేర్యాల మండల ఎంఈఓ బి.నరేందర్,కొమురెల్లి మండలం.ఎంఈఓ కె.రవి,ధూళిమిట్ట మండల ఎంఈఓ.మీనాంజనేయులు, మద్దూరు మండల ఎంఈఓ వరదరాజులు పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమ కన్వీనర్ బి.నరేందర్,మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని అర్హతలను ఉపాధ్యాయులు చేత పాఠ్య బోధన నిర్వహించడం జరుగుతుంది.కాబట్టి ప్రతి గ్రామాలను విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలు పంపించకుండా,ప్రభుత్వ పాఠశాల పంపియాల్సింది కోరనైనది.అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో అనేక రకమైన మౌలిక సదుపాయాలు కలిగి ఉన్నాయని,ఉచిత యూనిఫామ్స్,ఉచిత పాఠ్యపుస్తకాలు,మధ్యాహ్న భోజనం,కంప్యూటర్ విద్య,ఐపీఎఫ్ ప్యానల్ ద్వారా పాఠ్యబోధన, లైబ్రరీ ఫెసిలిటీస్,విశాలమైనటువంటి తరగతి గదులు,టాయిలెట్స్ ఇలా అనేక రకాలుగా సదుపాయాలు ఉంటాయి కాబట్టి,ప్రభుత్వ పాఠశాలలోనే మీ గ్రామాల విద్యార్థులు చదివే విధంగా సర్పంచ్ లు చొరవ తీసుకోవాల్సిందిగా కోరునైనది.ఈ కార్యక్రమంలో జి సి డి ఓ.నర్మద,జెండర్ స్పెషలిస్ట్ పద్మ,ఆర్పీలు డీ.రాకేష్ రెడ్డి,పబ్బోజు రాజమౌళి,బీ.బాల భాస్కర్,సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్నఎమ్మెల్యే నవీన్ యాదవ్




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,కొమురవెల్లి, జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించి,శ్రీ మల్లికార్జున స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం,అభివృద్ధి కోసం ప్రార్థించారు.ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కి ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్,కిసాన్ సెల్ బొచ్చు ఎల్లయ్య యాదవ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు,మాజీ సర్పంచ్ చెరుకు రమణా రెడ్డి,యూత్ సెక్రటరీలు ఉప్పల వంశీ, యేనిశెట్టి కిరణ్,టౌన్ యూత్ గుండా మహేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈగ కనకరాజు,సార్ల కొల్ బాయ్ కనకయ్య,పుట్ట శ్రీనివాస్,చింతల రమేష్ మరియు పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కు ఇసుక క్యారీలపై ఉన్న శ్రద్ధ రైతుల ధాన్యం తరలించడంలో లేదు



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 13 మే :ఇల్లంతకుంట మండల కేంద్రంలో మీడియా సమావేశంలో సిద్ధం వేణు మాట్లాడుతూ మరో పది రోజుల్లో రోహిణి కార్తె వస్తుందని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యుద్ధప్రతిపాదికన ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు.ధాన్యం ఎక్కడికక్కడే పేరుకుపోయి ఉందని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చుట్టపు చూపుగా ఇల్లంతకుంట లో నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఇటు వైపు తొంగిచూడటం లేదన్నారు.స్థానిక ఎమ్మెల్యేకు రైతుల పట్ల కాస్తంత అయిన జాలి లేదని కొనుగోళ్లు సాగక... లారీలు రాక రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఎర్రటి ఎండలో అన్నమో రామచంద్ర అంటున్న కూడా ఎమ్మెల్యే కు కనికరం లేదన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే అధికారులతో సమీక్ష నిర్వహించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్, ఇతర శాఖల అధికారులు ఇల్లంతకుంట మండలంలోని రైతులను పట్టించుకోకుండా ఉన్నారని...లారీల సమస్య తీర్చి వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. ఇల్లంతకుంట మండలంలోని రైతులు ధాన్యం, పొద్దుతిరుగుడు,మొక్కజొన్నలు కొనుగోలు చేసి తరలించాలని ధర్నాలు చేస్తున్నారని,అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, అధికారులకు చలనం లేదన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి రెండు లారీలు పంపించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు చేరుకుపెళ్ళి రాజిరెడ్డి, ఉపసర్పంచుల ఫోరమ్ మండల మాజీ అధ్యక్షుడు ఎండి.సాదుల్, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్, రవిందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,చేరుకుపెళ్ళి ఇంద్రసేనారెడ్డి తోట తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా....



మనప్రజాప్రతినిధి//అక్బర్ పేట భూంపల్లి: దుబ్బాక నియోజకవర్గం. సిద్దిపేట జిల్లా. నేడు దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా....రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలను నిర్వహిస్తోందని, తద్వారా రానున్న విద్యా సంవత్సరానికి పాఠశాల విద్యావ్యవస్థ మరింత మెరుగవుతుందని జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ పి. రామస్వామి అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు దుబ్బాక పట్టణంలోని ఐఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పాఠశాల విద్యా కార్యక్రమాల కార్యశాల (వర్క్ షాప్)ను పురపాలిక చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత, ఏఎంసీ చైర్మన్ కొంగర రవి, పిఎసిఎస్ చైర్మన్ కైలాస్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల సర్పంచులు, కౌన్సిలర్లు హాజరైన ఈ వర్క్ షాప్ లో ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న బోధన, విద్యార్థుల అభ్యసనం, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కార్యాచరణను వివరించి, విద్యాశాఖ విజయాలు, లక్ష్యాలు, ఇతర అంశాలపై వారికి అవగాహనను కల్పించారు. దానితోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పాత్ర, బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, చొరవతోనే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మెరుగైన విద్య, డిజిటల్ బోధనతో పాటు నాణ్యమైన ఆహారము, ఇతర మౌలిక వసతులను, సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దేవరాజ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, దుబ్బాక, అక్బర్ పేట-భూంపల్లి, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల ఎంఈఓలు ప్రభుదాస్, అంజయ్య గౌడ్, కనకరాజు, రాజగోపాల్ రెడ్డి, మాస్టర్ ట్రైనీలు మధుసూదన్, సాదత్ అలీ, ఉమాశంకర్, పలు గ్రామాల సర్పంచులు, (ఆల్మస్ పూర్ గ్రామ సర్పంచ్ మీరపురం పద్మ మల్లేశం, ఉపసర్పంచ్ గుజ్జుల చంద్రం వార్డ్ మెంబర్ మండల నర్సిములు )కౌన్సిలర్లు, ఎమ్మార్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కనబడుట లేదు మక్కారాజు గ్రామ మహిళా అదృశ్యం

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 13:చేగుంట మండలం మక్కారాజ్ పేట్ గ్రామానికి చెందిన మల్ల రెడ్డి జానమ్మ (65)ఉదయం నుండి కనిపించకుండా పోయారు, అప్పటి నుండి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకుండా పోయింది, ఇట్టి విషయం లో ఆమె కుమారుడు మల్లారెడ్డి ఎల్లారెడ్డి, ఫిర్యాదు మెరుగు చేగుంట ఎస్సై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న వడ్ల నవీన్ కుమార్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 13:చేగుంట మండలం చందాయిపేట్ గ్రామంలో నిరుడి పుష్ప నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి చేగుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా పాల్గొన్నారు. నూతన గృహాలలో అడుగుపెట్టిన లబ్ధిదారులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడం,మంత్రి ముఖ్య లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అనేక మంది కుటుంబాలు ఆనందంతో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నాయని తెలిపారు.ఇంటి అనేది ప్రతి కుటుంబానికి భద్రత, గౌరవం, సంతోషానికి ప్రతీక అని చందాయిపేట్ గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా పేర్కొంటూ, ఈ పథకం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ పబ్బ నగేష్ గుప్తా,గ్రామ కార్యదర్శి కృష్ణ,కాంగ్రెస్ పార్టీ మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, అన్నం ఆంజనేయులు ,చేగుంట ఉపసర్పంచ్ రఫీ, గ్రామ కాంగ్రెస్ నాయకులు దండు మహేష్, బాస రాజు యాదవ్,యూవనాయకులు ప్రజాప్రతినిధులు, పార్టీ స్థానిక నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి తూప్రాన్ ఆర్డి ఓ జయచంద్రరెడ్డి



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 13: మండలం లో యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని తూప్రాన్ ఆర్డి ఓ జయచంద్రరెడ్డి,సూచించారు. గురువారం వరి కొనుగోలు ప్రక్రియను పరిశీలించేందుకు చేగుంట మండలం రెడ్డి పల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో కొనసాగుతున్న కొనుగోలు ప్రక్రియను ఆయన సమగ్రంగా పరిశీలించారు. కేంద్రాల్లో రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ధాన్యం రికార్డులను పరిశీలిస్తూ నమోదు పత్రాల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని కేంద్రాల ఇన్‌చార్జీలకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలన్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే తూకం చేసి కొనుగోలు పూర్తి చేయాలని, ఆ తర్వాత ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ వేగంగా జరగాలని తద్వారా రైతులకు నగదు చెల్లింపులు వంటి అంశాల్లో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తల్లిదండ్రునికి అదనపు లారీలు అవసరమని అన్నారు, రైస్ మిల్లు లో లోడింగ్ అన్లోడింగ్ ప్రక్రియ సచావుగా జరిగేటట్లు చూడాలని అధికారులకు ఆదేశించారు,కొనుగోలు కేంద్రాల్లో రవాణా శాఖ అధికారులు, పోలీస్ శాఖ వారు కలిసి ప్రైవేట్ లారీలను కొనుగోలు కేంద్రాలకు వచ్చేటట్లు చూసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారుఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోక్సో బాధితులకు వేగవంతమైన సహాయం అందించాలి



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 13:లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలలకు భరోసా సెంటర్ ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఆయన సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించిన అదనపు ఎస్పీ.. పోక్సో కేసులు, లైంగిక వేధింపుల బాధితుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు.లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు, బాలల పట్ల సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. బాధితుల్లో భయాందోళనలు తొలగించి ధైర్యం కల్పించాలని, ప్రతి కేసులో సకాలంలో న్యాయ, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బాధితులకు మానసిక బలం చేకూర్చే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. పోక్సో చట్టాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. వేధింపులు, అత్యాచారాలు, నిరాదరణకు గురైన మహిళలు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యపరమైన సేవలు, సామాజిక భద్రత, మానసిక ధైర్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందిస్తున్నామని చెప్పారు.లైంగిక వేధింపులకు గురైన వారు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు కఠినంగా అమలులో ఉన్నాయని, లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడిన వారికి కఠినమైన జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ శ్వేతతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బొడ్రాయి ప్రతిష్ట, మహోత్సవంలో పాల్గొన్న మంత్రి వివేక్



మన ప్రజా ప్రతినిధి కొండపాక : కుక్కునూరు పల్లి మండల కేంద్రంలో జరుగుతున్నా బొడ్రాయి ప్రతిష్ట,ఎల్లమ్మ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి,ఉమ్మడి కొండపాక మండల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి హాజరై బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బొడ్రాయి పండుగ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు నిర్వచనం అన్నారు. దేవతల ప్రతిష్టలు నిర్వహించుకోవడం శుభప్రధమన్నారు.ఈ కార్యక్రమనికి స్థానిక సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య, వివిధ గ్రామ సర్పంచులు ఉప సర్పంచులు మాజీ సర్పంచులు నాయకులు గ్రామ పాలకవర్గం సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# బక్రీద్ పండుగ నేపథ్యంలో తూప్రాన్ టోల్ గేట్ చెక్ పోస్టును తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 13:రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అప్రమత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తూప్రాన్ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టును ఆయన స్వయంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అనుమానాస్పద వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే చెక్ పోస్టుల వద్ద ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల రవాణా తనిఖీల్లో సమన్వయం కోసం వెటర్నరీ సిబ్బంది కూడా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ట్రాఫిక్ బ్యాటన్స్ మరియు రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. “అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం” అని హెచ్చరించారు.